క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో మహిళ వంటమనిషుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రవీందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి హెడ్ కుక్, రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు కేజీబీవీలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళలు బయోడేటా ఫారం, ఎస్సెస్సీ మెమోతో పాటు 7వ తరగతి మెమో తీసుకురావాలని కోరారు. హెడ్‌కుక్‌కు ఎస్సెస్సీ, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి, గతంలో పనిచేసిన అనుభవం ఉండాలని సూచించారు. వయస్సు 18 నుంచి 45వరకు వయస్సు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. తలసరి వేతనం రూ.9,750 ఉంటుందని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


శ్రీనివాస్ అయిలయ్య

కమలాపూర్ : తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పంకెర్ల కుమారస్వామి తెలిపారు. అధ్యక్షుడిగా పుల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బాషబోయిన మల్లికార్జున్, పుల్ల అయిలయ్య, బోయిన సురేష్, ప్రధానకార్యదర్శిగా మంద కుమార్, కార్యదర్శులుగా అన్నెమనేని ఆంజనేయులు, మాట్ల కుమార్, ప్రచార కార్యదర్శులుగా చిలువేరు అశోక్, చిలువేరు శ్రీనివాస్, పుల్ల పున్నంచందర్, కోశాధికారిగా మునిగె రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శివరాత్రి మహేశ్, చీర సాంబయ్య, మొండెద్దుల చంద్రమౌళి, గౌరవ అధ్యక్షులుగా మాట్ల అయిలయ్య, పుల్ల కొమురయ్య ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

'జంగా'కు అభినందన



వేలేరు : రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జంగా రాఘవరెడ్డిని మండల నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, పార్టీ మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, నాయకులు తిరుపతిరెడ్డి, సంపత్, సంతోష్‌రెడ్డి, రమేశ్, సలీం మాలిక్, అమర్‌సింగ్, రణదీర్ రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామంలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఆ స్కూల్ నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు చక్రవర్తుల నాగార్జున, చందా రాజేందర్, శైలజ బుధవారం సొంత డబ్బుతో బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అలాగే స్కూల్‌కు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రియాజుద్దీన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించి కోడ్‌లుగా ఏర్పాటు చేసిందని ఆందోళన వెలిబుచ్చారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేల చొప్పున చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల, అధ్యక్ష, కార్యదర్శులు చినగారి రాణి, ఇసంపెల్లి వజ్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో వైద్య శిబిరం



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణ స్వామి పర్యవేక్షణలో రైల్వే రెఫరల్ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, రైల్వే వైద్యులు శిబిరంలో సిబ్బంది, అధికారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతరెడ్డి, జనరల్ ఫిజీషియన్ రవికిరణ్‌రెడ్డి, ఆర్థోపెడిషియన్ ఉత్తమ్ కుమార్, గైనకాలజిస్ట్ డోనా, రైల్వే వైద్యులు హరిబాబు, ధీరజ్‌కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- చుట్టూ కంచెలు లేని వైనం
- బలవుతున్న మూగజీవాలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు


కమలాపూర్ పోచమ్మ గుడి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ టాన్స్‌ఫార్మర్

కమలాపూర్ : మండలంలో పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్ల పక్కనే విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు అమర్చిన అధికారులూ.. వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు తావిచ్చే విధంగా ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వాహనదారులు ఏ మాత్రం అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలినా ప్రాణాలు కోల్పోవడం ఖాయమని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికే పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో గేదెలు, మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలు విద్యుదాఘాతానికి బలయినట్లు తెలిపారు. మరిన్ని ప్రమాదాలు జరుగకముందే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ఉప్పల్- కమలాపూర్ మార్గంలో రోడ్డు పక్కన కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఉప్పల్- కమలాపూర్ మార్గంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకోం..


తహసీల్దార్ విక్రమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తే ఊరుకునేది లేదని సీఐటీయూ మండల అధ్యక్షుడు కొత్తూరి ఏశోబు అన్నారు. బుధవారం 24 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు అందజేశారు. జూలై 10వ తేదీన కార్మికుల కోర్కెల రోజుగా పాటించాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని హితవు పలికారు. అధికారంలోకి రాగానే 4 లేబర్ కోడ్‌లను అమలు చేయాలని పన్నాగం పన్నుతోందని, 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అందేలా చూడాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయడంతో పాటు తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు మర్చిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండేటి రవి, గబ్బెట రాంకుమార్, మునిగాల శ్రీనివాస్, బరిగల చంద్రయ్య, బొక్కల సురేందర్, బొక్కల రంజిత్, కొండేటి యాకయ్య, ఎండీ అమర్, ఏలియా, పూల, కొంరమ్మ, రూప తదితరులు ఉన్నారు.

'నీట్' లీకేజీకి బాధ్యత వహించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నర్సంపేట : నీట్ పేపర్ లీకేజీకి ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్, అజయ్ మాట్లాడారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో 24 లక్షల మంది జీవితాలు అగమ్యగోచరమయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. ఎన్‌టీ ఏజెన్సీ యువత జీవితాలతో చెలగాటం ఆడిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగినా ప్రధాని స్పందించకపోవడం సరికాదన్నారు. వెంటనే ఎన్‌టీ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలని, మానిటరింగ్ చేయడంలో విఫలమైన క్రమంలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటస్వామి, భిక్షపతి, ఏఐకేఎంఎస్ నాయకుడు మల్లన్న, పీడీఎస్‌యూ నాయకులు రాజేశ్, ఉషా, కిరణ్, అఖిల్, శివ, ప్రశాంత్, రవి, అఖిల, పవిత్ర, పావని, శ్యామల, మహేందర్, కిరణ్, శ్యామ్, అనిల్, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

నకిలీ నోటు వ్యవహారంపై ఘర్షణ



వేలేరు : మండలంలోని సోడాషపల్లి పోస్టాఫీస్‌లో వృద్ధులకు ఇచ్చే పింఛన్ డబ్బుల్లో నకిలీనోటు ఇచ్చారని పింఛన్‌దారుడి కుమారుడు మెరుగు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించాడు. తన తండ్రి పింఛన్ డబ్బులు తీసుకుని దాచి పెట్టుకుంటాడని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం ఓ అవసరం నిమిత్తం పింఛన్ డబ్బులు తనకు ఇవ్వగా అందులో ఒక నోటు వేరుగా కనిపించగా ఎవరు ఇచ్చారని అడిగానని తెలిపాడు. దీంతో అతను పోస్టాఫీస్‌లో పింఛన్ డబ్బులు ఇచ్చారని బదులిచ్చినట్లు తెలిపారు. ఆ నోటును పరిశీలించగా అది చిన్నపిల్లలు తినే చాక్లెట్‌లో వచ్చే రూ.500 పేపర్ నోటు అని తెలిపాడు. దీంతో వెంటనే పింఛన్ ఇచ్చే వ్యక్తి వద్దకు వెళ్లి ఈ నకిలీ నోటు ఎవరు ఇచ్చారని ప్రశ్నించగా అతను దురుసుగా ప్రవర్తించినట్లు బాధితుడి కుమారుడు తెలిపాడు. అంతేకాకుండా ఇంట్లోని ఆడవారిని తనపై దాడి చేసేందుకు పంపించారని ఆరోపించాడు. కాగా ఆ నోటు తాను ఇవ్వలేదని పోస్టాఫీస్ ఉద్యోగి వివరణ ఇచ్చాడు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి


రాయపర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రాయపర్తి (వర్ధన్నపేట) : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.రాజేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కనీస వేతనాలు అందక, ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల, గౌరవ అధ్యక్షురాలు బి.నిర్మల, ఉపాధ్యక్షురాలు ఇమ్మడి అనిత, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జె.రేణుక, నాయకులు కె.అరుణ, జి.సత్యవతి, భారతి, జి.స్వరూప, పద్మలక్ష్మి, మీనా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రియాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించి కోడ్‌లుగా ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేల చొప్పున చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల, అధ్యక్ష, కార్యదర్శులు చినగారి రాణి, ఇసంపెల్లి వజ్ర, అరుణ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఖిలా వరంగల్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఆర్‌ఆర్‌తోట పీహెచ్‌సీ వైద్యురాలు అనిత, కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఆర్‌ఆర్‌తోట పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాసి వడబోసిన నీటిని తాగాలని, చేతులను తరుచుగా శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. తొలుత పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ బుర్ర మురళి, ప్రైమరీ హైస్కూల్ ఇన్‌చార్జ్ జయప్రకాశ్, ఎండీ.అక్తర్, వైద్య సిబ్బంది మంజుల, మౌనిక, ప్రభాకర్, పద్మ, వీణ కృష్ణవేణి, ప్రశాంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్... మరమ్మతులో నిర్లక్ష్యం


పగిలిన మెయిన్ పైపులైన్

దుగ్గొండి : మండల కేంద్రంలో మెయిన్ పైపులైన్ పగిలిపోగా మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్ ద్వారా మండల కేంద్రానికి ప్రతీరోజు మంచినీరు అందుతుండగా బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మెయిన్ పైపులైన్ పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. బస్టాండ్ సెంటర్ నుంచి పైభాగంలో ఉన్న గ్రామస్తులకు నీరు అందుతుండగా కింది భాగంలో ఉన్న వారికి నీరు అందడం లేదు. ఈ విషయమై అధికారులకు సమాచారం ఇవ్వగా గ్రామ పంచాయతీలో నిధులు లేవని, తాము ఏమీ చేయలేమని అంటున్నారని గ్రామస్తులు వాపోయారు. నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా అందించాలని కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు తక్షణమే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


రాయపర్తి : విద్యార్థులకు నోట్‌బుక్స్, టై, బెల్ట్‌లు అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

రాయపర్తి : విద్యార్థులు చదువులో రాణించాలని కొండాపురం హైస్కూల్ హెచ్‌ఎం నాగకుమారి, గ్రామానికి చెందిన అట్టపెల్లి లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. తన కుమారులైన పురుషోత్తమ్, రామప్రభు జ్ఞాపకార్థం మండలంలోని కొండాపురం హైస్కూల్ విద్యార్థులకు లక్ష్మీనారాయణ బుధవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి 700 నోట్‌బుక్కులు, 60 టైలు, బెల్ట్‌లు, 60 జతల షూ అందజేశారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడారు. తన పిల్లల జ్ఞాపకార్థం విద్యార్థులకు తోడ్పాటు అందించినట్టు తెలిపారు. హెచ్‌ఎం నాగకుమారి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎద్దు కొమురమ్మ, మురళి, మాజీ సర్పంచ్ దయాకర్‌రావు, యాకయ్య, ప్రసాద్, మనోజ్‌గౌడ్, రామయ్య, రావుల గంగయ్య, ఎద్దు రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న మల్లేశం, నాయకులు

నర్సంపేట : తెలంగాణలో వేలానికి పెట్టిన నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ అధికారికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం మల్లేశం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసి ఉత్పత్తి పెంచుతామనే సాకుతో ప్రైవేటీకరణకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పదో రౌండ్‌లో తెలంగాణలోని శ్రావణపల్లి, తాడిచర్ల, సత్తుపల్లి, కోయగూడెం బొగ్గు గనుల బ్లాక్‌లను వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. ష్టంలోని బొగ్గు గనులను వేలం వేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమా అశోక్, శివరాత్రి కుమార్, బోనగిరి రామ్మూర్తి, బోనగిరి సారయ్య, ఈర్ల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- కంపు కొడుతున్న చికెన్ వ్యర్థాలు
- ఇళ్ల సమీపంలోనే పడేస్తున్న వ్యాపారులు
- వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా చర్యలు తీసుకోని అధికారులు


నల్లకుంట చెరువు సమీపంలో పడేసిన చికెన్ వ్యర్థాలు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల వైపునకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. చికెన్ సెంటర్ వ్యాపారులు చేస్తున్న నిర్లక్ష్యపు పనికి కాలనీవాసులతో పాటు విద్యార్థులు, గ్రామస్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని చికెన్ సెంటర్ల వ్యాపారులు వ్యర్థాలను ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలోని నల్లకుంట చెరువు సమీపంలో పడేస్తున్నారు. దీంతో వ్యర్థాల నుంచి దుర్వాసన వెదజల్లడంతో కాలనీవాసులు ముక్కు మూసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. వ్యర్థాలను బకెట్లు, టబ్బులు, మినీ డ్రమ్ముల ద్వారా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో గుట్టల వద్ద నల్లకుంట చెరువు శిఖంలో పడేస్తున్నారు. దీంతో కుక్కలు, పందులు స్వైరా విహారం చేస్తూ చికెన్ వ్యర్థాలకు అలవాటుపడి మనుషులపై దాడి చేస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత నెలలో పిచ్చి కుక్కలు ఒకే రోజు 14మందిపై దాడి చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. పాఠశాల సమీపంలో చికెన్ వ్యర్థాలను చెరువు శిఖంలో పడేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించుకున్నా పెడచెవిన పెట్టారని, దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ భయం..

చికెన్ సెంటర్ల వ్యాపారులు వ్యర్థాలను నల్లకుంట చెరువు సమీపంలో పడేస్తుండడంతో వర్షాకాలంలో దోమలు, ఈగలు ప్రబలి సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని సమీప కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

కాలనీకి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తం


చెత్తాచెదారంతో నిండిన సీసీరోడ్డు


చెరువు సమీపంలో పడేసిన వ్యర్థాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుకఉన్న కాలనీవాసులు రోడ్డుపై నుంచి ఇళ్లలోకి వెళ్లాలంటే రోడ్డుపైన చెత్తాచెదారం, వ్యర్థాలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు సైతం ముక్కు మూసుకొని పాఠశాలలో తరతగతులు వింటున్నారని పలువురు విద్యార్థులు తెలిపారు.

దుర్వాసనను భరించలేకపోతున్నాం



దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటున్నాం. కుక్కలు, పందులు చికెన్ వ్యర్థాలకు అలవాటుపడి మనుషులపై దాడి చేస్తున్నాయి. దుర్వాసనతో వాంతులు అవుతున్నాయని, చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదు. ఇంట్లో ఉన్నా దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం పడితే కంపు కొడుతోంది. రోగాలు వస్తాయని భయం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- నిమిషకవి శారద, శాయంపేట

పల్లెల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించండి



చెన్నారావుపేట : మండలంలోని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ దయాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. గ్రామాల్లో చాలా చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయిందని చెప్పారు. సరైన డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలకు మలేరియా, డెంగీ, జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో వీధి లైట్లు, రోడ్లు లేక ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయాలని, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సాంబయ్య, అచ్చా నాయక్ పాల్గొన్నారు.